## కాలమ్ దాటని కథ

అందులో వున్న రెండు 'వంద' కాగితాల్ని జేబులోనికి కుక్కేసి, పర్సుని చెట్టు గుబురులోకి విసిరేసాడు నాగరాజు. వెంటనే భుజం మీద చేయి పడ్డంతో ఉలిక్కిపడ్డాడు! లాఠీని ఊపుతూ ముందు కొచ్చాడు కానిస్టేబుల్ కనకయ్య. "కదిలావంటే మక్కెలిరగదంతాను జాగ్రత్త!" అంటూ వెళ్లి పర్సుని పట్టుకొచ్చాడు. అటు ఇటూ త్రిప్పి చూచాడు.

"ఈ పర్సు నీదేనా?" కరకుగా అడిగాడు కనకయ్య.

అవునంటే ఎందుకు విసిరావంటాడేమో? కాదంటే—ఎక్కడ కొట్టేసావంటాడేమో?—అప్పుడు అసలు విషయం బయటపడుంది! ఎలా?

"ఊరికి కొత్తరడివా? ఇది వరకు అనుభవం లేనట్టుంది—పాపం! పద స్టేషనుకు!" చొక్కా పట్టుకొని గుంజాడు వాణ్ణి.

"సార్! సార్!! ఈసారికి ఒదిలేయండి సార్!" బతిమాలుతూ అటు ఇటు చూసి—"ఇదుంచండి సార్!" అంటూ రెండొందలు చేతిలో వుంచాడు. కళ్ళు మెరిసాయి కనకయ్యకి.

"ఛత్! నోర్ముయ్—ఇంతేనట్రా నీ మామూలు?! లప్పుడికే—ఊ తియ్ బయటకి—లేదంటే పద స్టేషనుకు!" మళ్ళీ గుంజాడు వాణ్ణి.

'వంద నష్టం' అనుకొంటూ అక్కణ్ణించి కదిలాడు నాగరాజు.

## వృత్తం

ఈల వేసుకుంటూ స్టేషనుకొచ్చాడు కనకయ్య. అప్పటికే చిటపటలాడిపోతున్నాడు ఇనస్పెక్టరు ఈశ్వరసామి! తన పాతికేళ్ళ అనుభవంలో ఇలాంటి ఒక అనుభవమా?! ఆ ఎంత అవమానం! బోనులో పడ్డ పులిలా అటు ఇటు తెగతిరిగేస్తున్నాడు. చివరికి—"కనకయ్యా! ఓ రెండొందలుంటే సర్దుతావూ!రేపిచ్చేస్తా!" అన్నాడు.

'ఓస్ ఇంతేగదా'ని పర్సు బయటకు తీసాడు కనకయ్య.

ఇనస్పెక్టరు ఆశ్చర్యానికి అంతులేదు. కళ్ళు ఆర్పడం మరిచిపోయేడు. "ఆ పర్సు...?"

"నాదే సార్! బావుందా సార్!! మొన్న మా మాంగారు మద్రాసు వెళ్తాంటే—చెప్పి తెప్పించాను!..."

"ఆ అలాగా! ఆ పర్సు వెనుకవేపు రహస్య అర ఒకటి వుంటుంది కదూ—దానిలో నీ ఫోటో కూడా వుంటుంది కదూ—ఏదీ తీసి చూపించు!"

"పర్సులోని ఫోటోని చూసిన కనకయ్య ముఖంలో నెత్తురు చుక్కలేదు. పర్సుని లాక్కుంటూ—"ఇందులో నాలుగు వందలుండాలి! ఏమయ్యాయి?!" అన్నాడు ఇన్‌స్పెక్టరు ఈశ్వరసామి.

మౌనంగా మూడు వందలు ఇచ్చాడు కనకయ్య.

"మిగతా వందా?!" ఆరోజు 'సంపాదన'లోంచి ఇస్తూ—'వంద నష్టం' అనుకొన్నడు కనకయ్య.

'రెండు వందలు లాభం' అనుకొన్నాడు ఇన్‌స్పెక్టరు ఈశ్వరసామి.

—జిల్లేళ్ళ బాలాజీ

## మాండలీన్ శ్రీనివాస్‌కు రాజాలక్ష్మి అవార్డు



లలితకళల వికాసానికి, సంగీత, సాహిత్య, విజ్ఞాన శాస్త్ర, సామాజిక రంగాలలో విశిష్ట సేవ చేసిన ప్రముఖులను సత్కరించే లక్ష్యంతో మద్రాసులో (1979) నెలకొల్పబడిన శ్రీ రాజాలక్ష్మీ ఫౌండేషన్ ప్రతిష్ఠాత్మకమైన అవార్డును యీ ఏడాది మాండలీన్ వీరుడు శ్రీనివాస్‌కు యివ్వనున్నట్లు ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీ పి.వి. రమణయ్యరాజా తెలియజేశారు. ఫౌండేషన్ సలహామండలిని సంప్రతించి ఈ నిర్ణయం గైకొన్నారు. అవార్డును నవంబరు 19న ప్రదానం చేస్తారు.

పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన మాస్టర్ యు. శ్రీనివాస్ చిన్నతనంలోనే 'మాండలీన్' వాద్య నైపుణ్యాన్ని సంగీత ప్రపంచానికి రుచి చూపించాడు. ఈ అవార్డు క్రింద అతనికి 15,000 రూపాయలు నగదు, ప్రశంసాపత్రం యిస్తారు.

పదకొండవ యేటనే శ్రీనివాస్ 1981లో ఆంధ్రప్రదేశ్ త్యాగరాజ ఆరాధనోత్సవాలలో మాండలీన్ కచేరీ చేశాడు. 1981లో అతని కుటుంబం మద్రాసుకు మకాం మార్చారు. అక్కడ సాలూరు రాజేశ్వరరావు సంగీత బృందంలో చేరాడు. 1983 నాటికి మద్రాసు నగరంలోని అన్ని సంగీత సభలలోను కచేరీలుచేసి రికార్డు సృష్టించాడు. 1984లో పలుదేశాలు పర్యటించి సంగీత రసజ్ఞులను మెప్పించాడు.

సంగీత సరస్వతి శ్రీమతి ఎం.ఎస్. సుబ్బులక్ష్మి "బాలభాస్కర్" బిరుదం యిచ్చారు. లాల్‌గుడి జయరామన్ అతనిని యిటీవలనే "సంగీత చూడామణి" బిరుదంతో సత్కరించారు. తమిళనాడు ప్రభుత్వం ఆస్థాన ప్రభుత్వ కళాకారుడుగా నియమించి సత్కరించింది.

## మాండలీన్ మహావీరుడు.

"కుమార గంధర్వ", "సంగీత బాల భాస్కర" మొదలైన ఎన్నో బిరుదులు అత్యంత చిన్నవయసులోనే సాధించిన యు. శ్రీనివాస్ మాండలీన్ కచేరీ, జూలై ఏడవ తేదీ సాయంత్రం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఎందరో రసజ్ఞులైన సంగీత ప్రియులను ఆనందతరంగాలపైన తేలియాడించింది.

మొదలు పెడుతూనే "తోడి" వర్ణంతో మొదలు పెట్టి శ్రోతలను ఆకట్టుకున్నాడు. తరువాత "నాట" రాగంలో 'స్వామినాథ పరిపాలయ' అనే దీక్షితార్ కీర్తనతో ఒక ఆట ఆడించాడు. త్రిస్థాయిలో మాండలీన్ పలికిస్తుంటే ఇద్దరు, ముగ్గురు మనుష్యులు మాట్లాడి సంభాషించుకున్నట్లుగా ఉందిగాని, ఒక పాశ్చాత్య తంత్రీవాద్యం వింటున్నాము అని అనిపించలేదు సభలో కొందరు ప్రేక్షకులకు.

'శ్యామ' రాగంలో ముత్తైయ్య భాగవతార్ కీర్తన 'సారస ముఖి! సకల భాగ్యదే' అన్న కీర్తన వింటుంటే నిండుగా ప్రవహిస్తున్న కాలువలో, ఒడ్డుననున్న చెట్టు నుంచి వర్ష బిందువులు పడుతున్న శబ్దాలు వింటుంటే కలిగే ఒక అనిర్వచనీయమైన ఆనందం వంటిది కలుగుతుంది.

తరువాత వరుసగా "చంద్రజ్యోతి" రాగంలో "బాగాయెనయ్యా! నీ మాయలెంతో", "గౌరిమనోహరి" రాగంలో గురిలేక ఎటువంటి గుణికితెలియును", "ఆందోళిక" రాగంలో "రాగ సుధారస" అన్న త్యాగరాజ కీర్తనలు ఇంత చిన్నతనంలో అంతటి స్వరప్రస్తార జ్ఞానం అతనికి ఎలా కలిగిందా అని అనిపిస్తాయి.

ఈ సంగీత సభ "నాగార్జున సాంస్కృతిక కేంద్రం" విజయవాడ వారి మూడవ కార్యక్రమం. శ్రీ టి.వి.శంకరనారాయణ సభకు అధ్యక్షత వహించారు. సాంస్కృతిక కేంద్ర కార్యదర్శి శ్రీ చివుకుల సుందరరామ శర్మ అతిథులను వేదికపైకి ఆహ్వానించారు. విజయవాడ అర్బన్ పోలీస్ సూపరింటెండెంట్ శ్రీ కె.యస్.వ్యాస్ ముఖ్య అతిథిగా సభలో పాల్గొన్నారు.

ఏ.పా.శా.